క్లుప్తంగా

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయచోటి టౌన్ : రాయచోటి ఏపీ మోడల్ స్కూల్లో అమ్మకు వందనం పథకంపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ రేఖ బహుమతులు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యతో పాటు వివిధ కళలపై ప్రతిభ చాటాలని చెప్పారు. కళలలో ప్రతిభ కనబరిస్తే భవిష్యత్తులో కూడా ఉంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న బ్యాంక్ అధికారి గుర్రప్ప తదితరులు

సంబేపల్లె :ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని కడప డీసీసీబీ బ్యాంక్ డిప్యూటీ రిజిస్టర్, ప్రత్యేక అధికారి గుర్రప్ప కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార పరపతి కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయతీ రుణాలపై రైతులకు అవగాహన కల్పించారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలని కోరారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ కడప బ్యాంక్ చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణం కొత్తపేటలోని గ్రూప్ థియేటర్స్ వద్ద వెలసిన శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో స్వామి వారి మూలవిరాట్‌మూర్తులను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. అనంతరం స్వామి వారికి ఆకు పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

లక్ష్మీ నరసింహస్వామికి..

రాయచోటి పట్టణం లక్ష్మీపురంలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కావడంతో స్వామి వారి మూలవిరాట్‌ను పలు రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు.


డీసెట్‌లో ఉత్తమ ప్రతిభ



ఆసీఫాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాయచోటి టౌన్ : విద్యార్థిని షేక్ ఆసీఫా అంజుమ్ డైట్ సెట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్ సాధించినట్లు మోడల్ స్కూల్లో ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాల్ రేఖ తెలిపారు. షేక్ ఆసీఫా ఎంపీసీ గ్రూపులో 872/1000 సా. ధించిందన్నారు. అనంతరం టీచర్ ట్రైనింగ్ కోర్సు (డీఈఈసెట్) కోసం రాసిన భౌతిక శాస్త్రంలో రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంక్ సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం



పీర్లను ముస్తాబు చేస్తున్న నిర్వాహకులు

పెనగలూరు: మత సామరస్యానికి మొహర్రం పండుగ ప్రతీక అని పెనగలూరు ముస్లింలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెనగలూరులో పీర్ల చావిడిలో శుక్రవారం రాత్రి పీర్లను కిందకు దింపారు. మొహర్రం పండుగకు పీర్లను దింపడంతో వేడుకలకు ముస్తాబైనట్లు ముస్లింలు తెలిపారు. మొహర్రం పండుగను హిందూ ముస్లింలు కలయికతో జరుపుకోవడం ఆనవాయతీగా వస్తోందని వారు తెలియజేశారు. జూలై 4వ తేది నుండి 6వ తేది వరకు మొహర్రం వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల ఉద్యమబాట

- ముకుమ్మడిగా సెలవుపెట్టిన కార్యదర్శులు
- సమస్యలపై డీపీఓ, కలెక్టర్లకు వినతిపత్రాలు
- సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన



జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రాయచోటి : రోజూ ఉదయం ఆరు గంటలకు గ్రామాల్లో విధులకు హాజరై ఆరోజు దిన పత్రికలో ఫొటో దిగి దానిని పంచాయతీ శాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలంటూ ప్రభుత్వం ఆశాఖ ఉన్నతాధికారులకు మౌఖికంగా జారీ చేసిన ఆదేశాలను నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు అన్నమయ్య జిల్లాలో ఉద్యమ బాట పట్టారు. ఇందులో భాగంగా పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య యూనియన్ ఆధ్వర్యంలో శనివారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఎదుట పెద్దఎత్తున నిరసన తెలియజేసి కలెక్టర్, డీపీఓలకు వినతిపత్రాలను అందజేశారు. నిరసన కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామ పంచాయతీ కార్యదర్శులు, జిల్లా వ్యాప్తంగా మూకుమ్మడిగా మెడికల్ సెలవులు పెట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా వారి సేవలు ఒకరోజు ఆగిపోయాయి. ఇప్పటికే స్థానిక ఎంపీడీఓలకు వినతిపత్రాలను అందజేశామని కార్యదర్శులు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్యదర్శుల వేదనలు, రోదనలతో ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

డబ్బులు లేవు.. పని ఒత్తిడి అధికం

గ్రామ పంచాయతీల కోసం రాష్ట్రానికి కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను నెలల తరబడి ప్రభుత్వం విడుదల చేయడం లేదని కార్యదర్శుల సంఘం నాయకులు పేర్కొన్నారు. దీంతో పంచాయతీలు నిధులు లేక కొట్టుమిట్టాడుతున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. నిధులులేవన్న కారణంతో సర్పంచ్‌లు పారిశుద్ధ్య పనులు నిర్వహించలేక చేతులు ఎత్తేయడంతో తమపై మరింత పనిభారం పెరిగిందని వారు వాపోయారు.

వాలంటీర్ల బాధ్యతలు మాకే..

గతంలో వాలంటీర్లు చేసిన చిన్నచిన్న సర్వే పనుల భారం అంతా పంచాయతీ కార్యదర్శులపై పడుతోందని వారు చెబుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల్లో పాల్గొనే క్లాత్ మిత్రలు ప్రభుత్వం ఇచ్చే వేతనంతో పనిచేసేందుకు ఏవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రతి వెయ్యి మందికి ఒక క్లాస్ మిత్రను ప్రభుత్వం ఏర్పాటు చేస్తే మంచిదని చెబుతున్నారు. సకాలంలో వారికి ప్రకటించిన వేతనాలను అందజేయాలని సూచించారు. అనేక పంచాయతీలలో ఆరు నెలల నుంచి ఏడాది కాలంగా క్లాప్ మిత్రలకు గౌరవ వేతనాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం తమకు జారీ చేసిన ఆదేశాలు అవమానించేలా ఉన్నాయని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు విమర్శించారు. పేపర్ పట్టుకొని నిలబడి ఫొటోలు దిగాలనడం చూస్తుంటే తమను పని దొంగలుగా చిత్రీకరిస్తున్నారని, తద్వారా మానసిక క్షోభకు గురవుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కుటుంబాలకు దూరంగా..

ఉదయం నుంచి రాత్రి వరకు పనిభారంతో పంచాయతీ కార్యదర్శులు తమ కుటుంబాలను మరచిపోయే పరిస్థితి వస్తుందని మండిపడ్డారు. వాలంటీర్ల వ్యవస్థ అటకెక్కిన తరువాత పంచాయతీ కార్యదర్శులు పంచాయతీరాజ్ శాఖ విధుల కంటే గ్రామ, వార్డు సచివాలయాల సర్వే పనులే ఎక్కువగా చేపట్టాల్సి వస్తుందన్నారు. పైగా ఏదైనా పొరపాటు జరిగితే కార్యదర్శులనే ముందుగా బాధ్యులను చేస్తుండటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆందోళనలు ఉధృతం చేస్తాం

ప్రభుత్వం స్పందించి ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే రోజులలో విజయవాడలో ఆందోళన చేసే ఆలోచన కార్యాచరణను చేస్తామని నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి



సుదర్శన్ రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జి. మోహన్‌రెడ్డి, జి. శ్రీకాంత్ రెడ్డి, నాయకులు

లక్కిరెడ్డిపల్లి: అధైర్య పడొద్దు.. అండగా ఉంటామని నాయకులు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. బెయిల్‌పై విడుదలైన లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డిని లక్కిరెడ్డిపల్లిలోని ఆయన నివాసంలో శనివారం మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డితో కలిసి శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు ఎదుర్కొంటున్న కష్ట నష్టాలలోనూ పార్టీ ఎల్లవేళలా తోడుంటుందని పేర్కొన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు పరిష్కారమే లక్ష్యంగా ఒక కుటుంబంలాగా ఒకరికొకరం తోడుగా నిలుద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గడికోట ప్రభాకర్ రెడ్డి, జి. సుదర్శన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ఆవుల నాగభూషణ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రోళ్లబోడు బీటులో కూంబింగ్



సిద్దవటం రేంజి రోళ్లబోడు బీటులో కూంబింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దవటం: సిద్దవటం రేంజి పరిధిలోని రోళ్లబోడు బీటులోని సమస్యాత్మక ప్రదేశాల్లో, ఎర్రచందనం స్మగ్లర్ల కోసం కడప ఎర్రచందనం ఫ్లయింగ్ స్క్వాడ్, సిద్దవటం రేంజి అటవీ సిబ్బంది శనివారం కూంబింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ఆర్ఓ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఎర్రచందనం సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అటవీ సంపదను ప్రతి ఒక్కరూ కాపాడాలని సూచించారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం రేంజర్ బి. కళావతి, డిప్యూటీ రేంజర్ కె. ఓబులేసు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఫ్ ఎస్‌ఓ శ్రీకాశిరెడ్డి, ఎఫ్‌బీఓలు గాయత్రి, ఆదివిశ్వనాథ్, మధు, పెంచల్‌రెడ్డి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

రాయచోటి టౌన్ : యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారవద్దని అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి. మధుసూధన్ సూచించారు. శనివారం రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేర్ కమిటీ ఆధ్వర్యంలో మద్యం పానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక ఆనందం కోసం మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని పేర్కొన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలు అమ్మినా, కొనుగోలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. మానవత సేవ కేంద్ర కమిటీ సభ్యుడు సహదేవరెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించడం వలన ఆరోగ్యాలతో పాటు వారి జీవితాలు నాశనమవుతాయని తెలిపారు మద్యం పానం-అనర్థాలు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలోఅసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి జోగేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ప్రభాకర్, అధ్యాపకుడు ఎం. కృష్ణారెడ్డి, రాయచోటి ఎక్సైజ్ శాఖ సీఐ గురుప్రసాద్, ఎక్సైజ్ ఎస్ఐ ఓ. హుస్సేన్ బాషా, రాయచోటి అర్బన్ ఎస్ఐ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం



సీపీఓ గోపినాథ్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఓబులవారిపల్లె: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాస్తోందని ఏఐటీయూసీ నాయకులు మండిపడ్డారు. దేశవ్యాప్తంగా జూలై 9న కార్మిక సంఘాలు నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు సంబంధించి సమ్మె నోటీసును శనివారం ఏఐటీయూసీ నాయకులు మంగంపేట ఏపీఎండీసీ సీపీఓ. గోపినాథ్ త్రివేణి కాంట్రాక్టు కంపెనీ జీమ్ జగదీష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో 43కోట్ల మంది కార్మికులను మోదీ ప్రభుత్వం బానిసలుగా చేసేందుకు కుట్రలు చేస్తుందని, దీనిని కార్మికవర్గం తిప్పికొట్టాలని కోరారు. ఎందరో త్యాగ ఫలితంగా సాధించుకున్న 42హక్కులను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల పని గంటలను పెంచడానికి ప్రయత్నం చేస్తుందని, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులను కేంద్ర ప్రభుత్వం పెంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మాదరాజు గంగాధర్, పి. మురళి, కె. నాగరాజు, ఏపీఎండీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురసాల దినేష్ రెడ్డి, లక్ష్మీనారాయణ, తుమ్మల కృష్ణ చైతన్య, నరసింహాచారి, త్రివేణి కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, బుజ్జి పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా క్రికెట్ మ్యాచ్‌లు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ అందుకుంటున్న అనిల్

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ ఆరవపల్లిలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అరవపల్లి క్రికెట్ లీగ్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లోని మ్యాచ్‌లు శనివారం ఉత్కంఠభరితంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో పాటూరు జట్టుపై చింతరాజుపల్లె విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన చింతరాజుపల్లె జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్లను కోల్పోయి 111 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన పాటూరు జట్టు 12 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 86 పరుగులు చేసి పరాజయం చెందింది. విజేత జట్టు ఆటగాడు శీను 3 వికెట్లు తీయడంతో పాటు 29 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సొంతం చేసుకున్నాడు. మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో కుమ్మరపల్లి జట్టుపై ఉదయ్ 11 ఇసుకపల్లి జట్టు విజయం సాధించింది. ముందు బ్యాటింగ్ చేసిన ఇసుకపల్లి జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కుమ్మరపల్లె జట్టు 7 ఓవర్లలో 37 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. ఇసుకపల్లె జట్టు ఆటగాడు అనిల్ 4 వికెట్లను తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో అరవపల్లి క్రికెట్ లీగ్ సభ్యులు అరుణ్, బుల్లెట్ హరి, నవీన్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు



సాయిసందీప్



ఆకుల నాగరాజు

నందలూరు : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. గుంతకల్ రైల్వే డివిజన్ పర్సనల్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్స్ జూలై 7వ తేదీన రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎలక్షన్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే రెండు యూనియన్‌ల పరస్పర అంగీకారంతో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో భాగంగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ మొదటి విడతగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గ కమిటీ సభ్యులుగా 2025 జూన్ నుంచి 2027 జూన్ వరకు ఉంటారు. ఈ రెండు సంవత్సరాలకు గాను రైల్వే ఇన్‌స్టిట్యూట్‌కు సెక్రటరీగా మజ్దూర్ యూనియన్ కార్మికుడు బొమ్మి సాయిసందీప్, జాయింట్ సెక్రటరీగా ఆకుల నాగరాజు, ట్రెజరర్‌గా మజ్దూర్ యూనియన్ కార్మికుడు షేక్ షావల్లీ, కమిటీ మెంబర్లుగా యూనియన్ మెంబర్స్ బివి శికుమార్‌రాజు, జి.సతీష్, సి.వెంకటేశ్వర్లు, ఈ.సుబ్రహ్మణ్యం, బి.సిద్దయ్య, కె.సుబ్బరాయుడును యూనియన్ నాయకులు ఎన్నుకున్నారు.

నారాయణనెల్లూరుకు బస్ సర్వీసు ప్రారంభం



నారాయణనెల్లూరు బస్ సర్వీస్‌ను ప్రారంభించిన డీఎం రమణయ్య

రాజంపేట: రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలోని నారాయణనెల్లూరుకు శనివారం బస్‌సర్వీసను పునరుద్ధరించారు. ఈసందర్భంగా డీఎం జి.రమణయ్య మాట్లాడుతూ ఉదయం 7గంటలకు, సాయంత్రం 4 గంటలకు నారాయణ నెల్లూరు సర్వీసు నడుపుతామని తెలిపారు. ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్ సర్వీసులను వినియోగించుకోవాలని సూచించారు. ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆర్టీసీ డీఎం కార్యాలయం అధికారి మోడపోతుల రమణయ్య, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

ఎమ్మెల్యే ఆకేపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి

రాజంపేట: అభివృద్ధేధ్యేయంగా పనిచేయాలని అధికారులను రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథరెడ్డి ఆదేశించారు. పురపాలకసంఘం చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు, కౌన్సిలర్లు సంయుక్తంగా కలిసి పనిచేయాలన్నారు. పట్టణవాసులు పురపాలకసంఘం తరపున చేయాల్సిన సౌకర్యాలను సమర్థవంతంగా కల్పించాల్సిన బాధ్యత పురపాలకసంఘంలోని వివిధ విభాగాల అధికారులదేనని పేర్కొన్నారు. రాజంపేట పురపాలకసంఘం చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి మాట్లాడుతూ పురపాలనలో పారదర్శకత ఉండాలన్నారు. నిధులు వినియోగంలో జవాబుదారితనం ఉండాలని సూచించారు. అభివృద్ధికి సంబంధించి పనులు విషయంలో నాణ్యత లోపించరాదన్నారు. పురపాలనలో సక్రమంగా నిర్వహించేందుకు అధికారులకు కౌన్సిలర్లు, ప్రజలు సహకరించాలన్నారు. తాగునీటి సమస్యకు సంబంధించి తలెత్తిన అన్ని అంశాలను అమలుచేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. పట్టణంలో ప్రధానంగా పారిశుద్ధ్యం, తాగునీటి, వీధిలైట్లు తదితర సమస్యల లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. మున్సిపాలిటి వైస్‌చైర్మన్ మర్రి రవి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతులను కల్పించేందుకు అందరం కలిసికట్టుగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కౌన్సిలర్లు తమ ప్రాంత సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమయంలో కౌన్సిలర్ల అడిగిన ప్రశ్నలకు అధికారులు నీళ్లు నమిలారు. మార్కెట్ గదులు బాడుగులు రూ.20లక్ష బకాయిల వసూలు గురించి గత సమావేశంలో అడిగామని, వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్ సూరి నిలదీసిన అంశం సమావేశంలో వేడిపుట్టించింది. సమావేశంలో కమిషనర్ శ్రీనివాసులు, ఆర్ఐ సుబ్బరాయుడు, వైస్‌చైర్మన్ సుమియాతో పాటు పలువురు కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాసమస్యల పరిష్కారమే తన ధ్యేయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసన సభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. శనివారం తన ఎస్టేట్‌లో పలు గ్రామాల దళితవాడలకు చెందిన గ్రామస్తులు, శేషమాంబపుర పంచాయతీ పాపరాజుపల్లెకు చెందిన వారు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఏవైనా తన స్థాయిలో పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. అనంతరం పలువురు తాగునీటి సమస్యతోపాటు గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ



బషీర్‌ఖాన్ కుమారుడిని పరామర్శిస్తున్న సుగవాసి బాలసుబ్రహ్మణ్యం

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు బేపారి బషీర్‌ఖాన్‌ను శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యం వేర్వేరుగా పరామర్శించారు. వారి కుమారుడు బేపారి మహమ్మద్‌ఖాన్‌తో ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ నాయకులు షబ్బీర్, గౌస్‌ఖాన్, అన్నసలీం, రియాజ్, విజయభాస్కర్, ఖలీల్, కొత్తపల్లి ఇంతియాజ్, జబీవుల్లా, బేపారి అసద్, ఖలీల్‌బేగ్ తదితరులు ఉన్నారు.

4న సర్వసభ్య సమావేశం

నందలూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేడా విజయ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన 4న తేదీ ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాధాకృష్ణన్ తెలిపారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ సభ్యులు, మండల ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, గ్రామ సర్పంచులు, మండల ఉన్నతాధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

శాశ్వత అన్న ప్రసాద కేంద్రానికి స్థల పరిశీలన



అన్న ప్రసాద కేంద్రానికి స్థలాన్ని పరిశీలిస్తున్న టీటీడీ జేఈఓ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయ పరిసరాల్లో శాశ్వత అన్న ప్రసాద కేంద్రాన్ని నిర్మించేందుకు శనివారం టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం స్థలాన్ని పరిశీలించారు. శాశ్వత అన్న ప్రసాద కేంద్రానికి ఆలయ సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం పక్కన ఖాళీగా ఉన్న ఆలయ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి కల్యాణ వేదిక వద్ద భక్తులకు కనిపించేలా శంఖు చక్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఎలక్ట్రికల్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఓలు నటేష్ బాబు, ప్రశాంతి, ఈఈలు నాగరాజు, సుమతి, ఆలయ అర్చకులు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలతో కొత్త జీవితం

పుల్లంపేట: కృత్రిమ అవయవాలతో కొత్త జీవితం లభిస్తుందని విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షులు డాక్టర్ మల్లు సుబ్బనరసారెడ్డి తెలిపారు. శనివారం అన్నమయ్య జిల్లాలోని, రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో చేతన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో కృత్రిమ కాలు కొలతలు అందించారని, త్వరలో కృత్రిమ కాళ్లు అందజేస్తారని మల్లు సుబ్బనరసారెడ్డి తెలిపారు. ఈ కృత్రిమ కాలు కొలతలు తీసుకున్న పది రోజులు తరువాత ఆధునిక వెయిట్ లెస్ కృత్రిమ కాళ్లు అమర్చుతారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

సుండుపల్లె : రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని సుండుపల్లె ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలోని భైరవగుట్ట సమీపంలో ఆయన శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలలో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు తప్పకుండా ధరించాలని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తీసుకె ళ్లాలని చెప్పారు. కండీషన్‌లో ఉన్న వాహనాలనే డ్రైవింగ్ చేయాలన్నారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు మద్యం సేవించడం, సెల్‌ఫోన్ చూడడం, నిద్రలేమి వంటి కారణాలతో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకూ డదని చెప్పారు. వాహనాల తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాల ఉత్పత్తికి పోషకాల దాణా

- 50 శాతం రాయితీతో దాణా పంపిణీ
- మొదటి దఫా ఒక్కో రైతుకు 50 కేజీలు



రాయచోటి జగదాంబసెంటర్ : ఏటా ప్రకృతి వైపరీత్యాలతో పంటలను నష్టపోతున్న అన్నదాతలను ఆదుకునేది పాడి పరిశ్రమే. అందుకే పల్లెల్లో దాదాపు 90 శాతం రైతులు పశువుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. గేదెలు, ఆవులను పోషిస్తూ పాల ఉత్పత్తి చేసి డెయిరీలకు విక్రయిస్తున్నారు. ఈ తరుణంలో పాల ఉత్పత్తి పెరగాలంటే పోషకాల దాణా ఎంతో అవసరం. దాణాను పశు సంవర్ధక శాఖ రాయితీపై అందిస్తోంది.

పాల దిగుబడి పెంచేందుకు..

పశుగ్రాసం కొరత అధిగమించడంతో పాటు పాల దిగుబడి పెంచేందుకు పాడి రైతుల కోసం 50 శాతం రాయితీపై పశువుల దాణాను అందిస్తున్నారు. రూ.1,110 ఉన్న 50 కేజీల సమీకృత దాణా బస్తాను సగానికి ధర తగ్గించి 50 శాతం రాయితీపై రూ.555కే పాడి రైతులకు అందజేస్తున్నారు. రెండు ఆవులు, గేదెలు, ఒక దూడకు 50 కిలోల బస్తా చొప్పున అందిస్తున్నారు. ఇలా మూడు దఫాలుగా బస్తాలను అంటే 150 కిలోల పశువుల దాణాను రాయితీపై అందించేందుకు పశుసంవర్ధక శాఖ రైతు సేవా కేంద్రాలు, పశువుల ఆసుపత్రుల ద్వారా రైతుల నుంచి వివరాలు సేకరించింది.

పెలెట్స్ రూపంలో దాణా

ప్రభుత్వం అందించే సమీకృత పశువుల దాణా 20 శాతం ప్రొటీన్ కలిగి పెలెట్స్ రూపంలో 50 కేజీల చొప్పున పంపిణీ చేస్తున్నారు. అత్యంత నాణ్యమైన కల్తీ లేని దాణాను పశు సంవర్ధక శాఖ తొలిసారిగా రాయితీపై అందిస్తోంది. ఈ పథకంతో అనేక మంది పాడి రైతులకు లబ్ధి చేకూరనుంది.

తెలుపు రేషన్‌కార్డు తప్పనిసరి

తెల్లరేషన్‌కార్డు కలిగిన సన్న, చిన్నకారు రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులుగా పశు సంవర్ధక శాఖ నిర్ధారించింది. ఒక్కో పాడి రైతుకు ప్రస్తుతానికి ఒక్క బస్తా మాత్రమే పంపిణీ చేస్తున్నారు. రైతులు రేషన్ కార్డుతో పాటు ఆధార్ జిరాక్స్‌తో రూ.555 ముందుగా చెల్లించి నమోదు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ నిష్పత్తి ఆధారంగా దాణా కేటాయించనున్నారు.

వివరాలు సేకరిస్తున్నాం



పాల దిగుబడి పొందేందుకు పశువుల విక్రయాలను నిలువరించే లక్ష్యంతో పశు సంవర్ధక శాఖ ఈ పథకాన్ని అమలు చేస్తుంది. పాడి రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. ప్రస్తుతం మొదటి విడత పంపిణీ చేస్తున్నాం. రెండో విడత పంపిణీకి వివరాలు సేకరిస్తున్నాం.

– డాక్టర్ భాస్కర్, పశువైద్యాధికారి, చిన్నమండెం